క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు చర్యలు



వాజేడు: గోదావరి వరదలతో విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. స్తంభాలు నీట మునుగడంతో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని కడేకల్, కృష్ణాపురం, చంద్రుపట్ల, పెద్ద గంగా రం, టేకుల గూడెం గ్రామాలకు సరఫరా నిలిచి పోవడంతో విద్యుత్ స్తంభాలకు టీ రేజర్లను ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

గర్భిణుల తరలింపు



వాజేడు: మండలంలోని గర్భిణులను అధికారులు శుక్రవారం ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి పంపించారు. మండల పరిధిలోని కడేకల్ గ్రామానికి చెందిన ఇద్దరు గర్భిణులను తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ రాజు, ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు దగ్గర ఉండి వారికి అవగాహన కల్పించి ఆస్పత్రికి తరలించారు.

బ్రిడ్జికి అడ్డుపడిన వృక్షాల తొలగింపు



మంగపేట: మండల కేంద్రంలోని గౌరారం వాగుపై బోరునర్సాపురం–మంగపేట మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పిల్లర్ల మధ్య అడ్డు పడిన వృక్షాలు, చెత్తను పొక్లెన్, జేసీబీతో అధికారులు శుక్రవారం తొలగించారు. డీసీఆర్బీ డీఎస్పీ శోభన్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ఎస్సై రవికుమార్ పరిశీలించారు.

ఎంక్రాస్‌మెంట్ ప్రోగ్రాం

వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఎంక్రాస్ మెంట్ ప్రోగ్రాంను నిర్వహించారు. వాజేడు వైద్యశాలలో క్వాలిటీ కంట్రోల్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి పరిసరాలు, మందులు, వివిధ విభాగాలను జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్యతో కలిసి క్వాలిటీ కంట్రోల్ టీమ్ సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమం శనివారం కూడా కొనసాగుతుందని తెలిపారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వాజేడు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం(కె): పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరుకుంది. కార్మికులు రంజిత్, తాటి శ్రీను, లక్ష్మణరావు ఉన్నారు.

ఏటూరునాగారం: ట్రక్కులో తరలిస్తున్న నిత్యావసర సరుకులు



చిన్నబోయినపల్లిలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న పీఓ అంకిత్



పునరావాస కేంద్రాల ఏర్పాటు

ఏటూరునాగారం: మండలంలోని చిన్న బోయినపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లో వరదలో చిక్కుకున్న ప్రజలకు 500ల ఆహార ప్యాకెట్లను శుక్రవారం అందజేసినట్లు ఐటీడీఏ పీఓ తెలిపారు. ఒక్కో ప్యాకెట్‌లో సన్న బియ్యం 5 కేజీలు, కందిపప్పు 1 కేజీ, శనగపప్పు 1 కేజీ, చక్కెర 1 కేజీ, జెమినీ టీ పొడి 100 గ్రాములు, పల్లినూనె 1 కేజీ, ఉల్లిపాయలు 1 కేజీ, నాటు రవ్వ 1 కేజీ, రెండు వాటర్ బాటిళ్లు, గ్లూకాన్–డీ 50 గ్రాములు, పారాసిటమాల్ మాత్రలు–10, అరటిపండ్లు, రెండు బిస్కెట్ ఉన్నాయి.

కన్నాయిగూడెం: ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలకు రెండు పునరావాసు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని వెంకట్రావుపల్లి, గంగగూడెం ప్రజలను అక్కడికి తరలించారు. లక్ష్మీపురంలోని ప్రాథమిక పాఠశాలకు వెంకట్రావుపల్లికి చెందిన 60 మందిని, మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు గంగగూడెంకు చెందిన 80 మందిని తరలించినట్లు తహసీల్దార్ సలీమ్ శుక్రవారం తెలిపారు.

ములుగురూరల్: గోవిందరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రంలోని బాధితులకు నెమలి నర్సయ్య కుమారుడు ఉదయ్ సాయికుమార్ జ్ఞాపకార్థంగా నెమలి ఉదయ్ నెమలి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అధ్యక్షుడు సూడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఉదయ్ నెమలి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వందలాది మంది బాధితులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ నెమలి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నెమలి సమ్మక్క, నర్సయ్య మాదిగ, స్వరూప, డాక్టర్ నెమలి గాంధీ, బాలకృష్ణ, భావన, సాయిప్రసన్న, ప్రపంచ్ లక్ష్మీ జోగానాయక్, ఎంపీటీసీ అలూరు శ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్ రాజెందర్, మాజీ సర్పంచ్ భూక్య దేవానాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కోయగూడ ఎల్లాపురం నుంచి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న ఏఎస్పీ సంకీర్త్



వాజేడు: బాధితులను తరలిస్తున్న అధికారులు

పునరావాస కేంద్రాలకు తరలింపు

వాజేడు: ముంపు గ్రామల పరజలను అధికారులు పునరావాస కేంద్రలకు తరలిస్తున్నారు. మండలపరిధిలోని కడేకల్ నుంచి 363 మందిని, సుందరయ్య కాలనీ, ఇప్పగూడెం గ్రామల నుంచి 105 మందిని తరలించి చెరుకూరు, జగన్నాథపురం గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో ఉంచారు. శుక్రవారం, సాయంత్రం పెద్ద గొళ్లగూడెం లోని కొన్ని కుటుంబాల వారిని తరలించి శ్రీరామ్ నగర్ హాస్టల్లో పునరావసం కల్పించారు.

కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు

మంగపేట: భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపు ప్రాంత బాధితుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని బ్రాహ్మణపల్లి, చుంచుపల్లి, మంగపేటలో ఇప్పటికే 129 మందికి ఆశ్రయం కల్పించారు. కాగా శుక్రవారం ఉదయం నుంచి గోదావరి ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా మండల కేంద్రంలోని ముంపు ప్రాంతాలయిన పొదుమూరు, ముస్లిం వాడ, వడ్డెరకాలనీకి చెందిన 275 మందికి మంగపేట పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించారు.

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల, ఓడవాడ, కోయగూడ ఎల్లాపురం, దళిత కాలనీ తదిరత ప్రాంతాల నుంచి వరద బాధితులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామని ఏఎస్పీ సంకీర్త్ అన్నారు. శుక్రవారం ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించి సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, మరో ఎస్సై శ్రావణ్, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ వీరస్వామి కలిసి వాహనాలు, పడవల్లో తరలించారు. వారికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.



కడేకల్ గ్రామస్తులను తరలిస్తున్న అధికారులు



ములుగు రూరల్: అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు



మంగపేటలో..

వ్యాధులపై అప్రమత్తత అవసరం



మంగపేట: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి



వెంకటాపురం(కె)లో..

మంగపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో హెచ్‌వీ ముత్తమ్మ, ఏఎన్‌ఎం సారమ్మ, ఆశ కార్యకర్త సుశీల పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల, తుర్సావానిగూడెం మల్లాపురం, మరికాల గ్రామాల్లో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, వైద్యాధికారులు శుక్రవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాగరమేష్

మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన గుండారపు రమాకృష్ణ, నాగమణి, బాలన్నగూడెం పంచాయతీ పరిధిలోని నరేందర్‌రావుపేట గ్రామానికి చెందిన తాటి అనురాధల ఇళ్లు కూలిపోయి నిరాశ్రులయ్యారు. దీంతో బాధిత కుటుంబాలను రామకృష్ణ సేవాట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ శుక్రవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ. 2000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు ఆదినారాయణ, ఇందారపు రమేష్, గుమ్మల వీరస్వామి, మునిగెల మహేష్, నరేష్, చౌళం సాయిబాబు, గ్రామస్తులు రాంబాబు, శ్రీను, వినోద్, నర్సింహా, ప్రణయ్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 27 ఇళ్లు..

మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రమణక్కపేట, రామచంద్రునిపేట, కమలాపురం, బాలన్నగూడెం గ్రామాల్లో 05 ఇళ్లు పూర్తిగా కూలి పోగా 22 ఇళ్లు పాక్షికంగా ధ్వంసం అయినట్లు ఆర్ఐ కుమారస్వామి తెలిపారు.

మెరుగైన వసతులు కల్పించాలి

కన్నాయిగూడెం: పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి, గంగగూడెంకు చెందిన వారిని మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలకు, లక్ష్మీపురంలోని ప్రాథమిక పాఠశాలకు తరలించారు. దీంతో శుక్రవారం రాంబాబు కార్యకర్తలతో కలిసి సందర్శించారు. కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు అబ్బు రమేష్, ఎస్సీసెల్ అధ్యక్షుడు సునార్కని రాంబాబు, కటకం మల్లయ్య, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గాందర్ల నర్సింహారావు, భిక్షపతి, సుమన్, రాంబాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో యుద్ధ ప్రాదిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జంపన్నవాగు వరదకు మేడారం గ్రామం జలమయం కావడంతో వరదలకు వ్యాపారుల సామన్లు తడిసి ముద్దయి దుర్వాసన వ్యాపిస్తున్నాయని తెలిపారు. రోడ్లన్నీ బురదగా మారి అస్తవ్యస్తంగా ఉన్నాయని అధికారులు స్పందించి త్వరితగతిన చెత్తాచెదారం, చనిపోయిన కోళ్లను తొలగించి రోడ్లను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. వరద కారణంగా మేడారం, రెడ్డిగూడెంలో విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో కనీసం తాగడానికి కూడా నీళ్లు లేని పరిస్థితి నెలకొందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. మేడారాన్ని పూర్తిగా వరదతో మునిగినప్పటికీ కూడా ఒక్క అధికారి కూడా సందర్శించి గ్రామస్తులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించిన నాథుడే కరువైయ్యారన్నారు. తాడ్వాయి, మేడారంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రచారం చేయడమే తప్ప వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో భోజనాలు పెట్టిన దాఖలాలు లేవన్నారు. రోడ్లు తెగిపోవడంతో రవాణా సౌకర్యం లేక తాడ్వాయిలో చిక్కుకున్న ప్రయాణికులను కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, జిల్లా నాయకుడు ఆరెం లచ్చుపటేల్, డైరెక్టర్ రంగరబోయిన జగదీష్, సంఘం రాము ఉన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



కొట్టుకుపోయిన వెల్డింగ్ షాపును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



ముంపునకు గురైన పంటలను పరిశీలిస్తున్న రాజేందర్‌గౌడ్

ములుగురూరల్: అధిక వర్షాలతో వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. వరదలకు దెబ్బతిన్న ఇళ్ళను సీపీఎం పార్టీ నాయకుల బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో సర్వే జరిపించి బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, తక్షణ సాయంగా రూ.25,000 నగదు, క్వింటా బియ్యం, వంట సామగ్రి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చిట్టిబాబు, రాజేష్, మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, అంబాల మురళి, కడారి నాగరాజు, ఉపేంద్రచారి, పల్లెజీవన్, సీతారామరాజు, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలో మండల అధ్యక్షుడు ఎండీ.చాంద్‌పాషా ఆధ్వర్యంలో ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, నూనేటి శ్యామ్, రామకృష్ణ, స్వామి, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులోకి వరద



బురద పట్టిన మద్యం బాటిళ్లు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జంపన్నవాగు వరద కారణంగా రెడ్డిగూడెంలోని తిరుమల వైన్స్‌షాప్‌లో మద్యం అంతా తడిసి వ్యాపారులకు భారీ నష్టం ఏర్పడింది. గురువారం వరద నీటిలో మునిగిన మద్యం షాప్ శుక్రవారం తీసిన తరువాత మద్యం షాప్‌లో విలువైన మద్యం బాటిళ్లు వరదకు కొట్టుకుపోయిన విషయం యజమానులకు తెలిసింది. సుమారుగా రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు. షాపులో ఉన్న బాటిళ్లన్ని కూడా బురదమయంగా మారి విక్రయానికి పనిరాకుండా పోయాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి న్యాయం చేయాలని యజమాని కోరారు.

నీటమునిగిన ఆశ్రమ పాఠశాల సామగ్రి



ఆశ్రమ పాఠశాలలోకి చేరిన బురద

● 40 మందిని కాపాడిన హెడ్మాస్టర్

ఏటూరునాగారం: కొండాయి వద్ద పొంగిన జంపన్నవాగు కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండాయిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోకి వరద చేరడంతో హాస్టల్‌లోని బియ్యం, నిత్యావసర సరుకులు నీటిలో నానిపోయాయి. రికార్డులు, కంప్యూటర్ సామగ్రి పూర్తిగా వరదతో తడిసిపోయాయి. ఆశ్రమ పాఠశాలలోకి వరద నీరు ముంచెత్తడంతో ప్రధానోపాధ్యాయుడు పాయం మీనయ్య 40 మంది విద్యార్థులను మల్యాలలోని సురక్షిత ప్రాంతానికి తరలించి కాపాడారు. వరద నీటిలో సైతం వారిని మోసుకుంటూ స్థానికుల సాయంతో కాపడడంతో పలువురు అభినందించారు.

ముంపు గ్రామాల్లో అధికారుల పర్యటన

మంగపేట: మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని వరద ముంపు ప్రాంతాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోదావరి వరద తీవ్రత ప్రమాదకరంగా ఉంటే ముంపు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వరద ముంపు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు స్థానికంగా ఉండి వరద తీవ్రతను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్సై రవికుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ శోభన్‌కుమార్, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ, ఆర్ఐ తదితరులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై వెంకటేశ్వర్

ములుగు: ప్రజలు చేపల వేటకు వెళ్లొద్దని ఎస్సై అప్పని వెంకటేశ్వర్ సూచించారు. మండలంలోని సమీపంలో చేపలు పడుతున్న వారికి ఎస్సై శుక్రవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. వర్షాలు తగ్గేంత వరకు వాగులో దిగి చేపలు పట్టడానికి దిగితే శాఖ తరుపున చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



కుక్కతోగు వాగు వద్ద రోడ్డు పైకి చేరిన వరద నీరు



పాత్రాపురం వద్ద నీటిలో దాటుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

వెంకటాపురం(కె): మండలంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శుక్రవారం మండలంలోని వాగులు వంకలు పొంగటంతో పాటు గోదావరి వరద పెరుగుతుంది. దీంతో మండలానికి రాకపోకలు నిలిచి పోయాయి. భారీగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరువచ్చి చేరుతుండటంతో మండల పరిదిలోని ఎదిర గుట్టల వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరింది. బొదాపురం, కుక్కతొగువాగు, పాత్రాపురం వాగుల వద్ద వంతెన వరద నీరు ఉధృతంగా ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తూండటంతో మండలానికి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. బోదాపురం, కుకకతోగు వద్ద స్పీడ్ పడవలను అధికారులు ఏర్పాటు చేశారు. అత్యవసర పనుల మీద వెళ్లే వారిని పడవల్లో తరలిస్తున్నారు. కాగా ప్రాత్రాపురం వద్ద మొకళ్లలోతు నీటిలో ప్రజలు దాటి వెళ్తున్నారు.

వరద ఉధృతి పరిశీలన

మండలంలో భారీ వర్షాలకు వా గులు పొంగి పొర్లటంతో పాటు గోదావరి ఉధృతంగా వస్తుండటంతో మండల అధికారలు, ప్రజాప్రతినిధులు శుక్రవారం గోదావరి వరద పరిస్థితులను పరిశీలించారు. మండల పరిధిలోని బోదాపురం, కుక్కతోగు వాగు, పాలెం వాగు సమీపాల్లో గోదా వరి వరద నీరు రోడ్లపైకి రావటంతో వరదలోకి ఎవరు వెళ్లకుండా బారికెడ్లను ఏర్పాటు చేశారు. ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలలో, వెంకటాపురం చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వెంగళరావుపేట, తుర్సావానిగూడెం, గొల్లగూడెం గ్రామాలకు గోదావరి వరద వచ్చే అవకాశం ఉండటంతో పునరావాస కేంద్రాలకు తరలిరావాలని గ్రామస్తులను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఉన్న స్పీడ్ బోట్‌ను బోదాపురానికి ట్రాక్టర్‌లో తరలించారు. మండల ప్రత్యేక అధికారి అరవింద రెడ్డి, తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు తదితరులు ఉన్నారు.



గోదావరి వరదను పరిశీలిస్తున్న అధికారులు



బోదాపురం వద్ద వంతెన పైకి చేరిన వరద నీరు

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న దిలిప్

ములుగు రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మల్లంపల్లి పొరుడు వనపాకాల దిలీప్ ఎంపీడీఓకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ.. తన ఇంటి ముందు చెత్తను శుభ్రం చేయడం లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలపగా నిర్లక్ష్యంగా వ్యహరించి నేనేమి చేయాలని సమాధానం ఇచ్చాడని తెలిపారు. దీంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దిలీప్ చెత్తను తీసుకుపోయి గ్రామ పంచాయతీ చాంబర్‌లో పోసి వినూత్న నిరసన వ్యక్తం చేశారు.